డిటెక్టివ్ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు. 116/- పొందిన కథ

# చీపురుపల్లి

## కశింకోట ప్రభాకరదేవ్

"డియస్పీ యింట్లో దొంగతనమా?!" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చిరంజీవి.

భారంగా నిట్టూర్చాడు సుధాకర్.

"అవును చిరంజీవి! నా యింట్లోనే దొంగతనం జరిగిందంటే ఏమనుకోవాలి! అందులోనూ ఈ దొంగతనం పట్టపగలు జరిగింది. ఆ దొంగ కూడా యింటి తలుపుల్ని బద్దలుకొట్టో, మనుషుల్ని బెదిరించో ఈ చోరీ జరపలేదు. మా యింట్లోని వాళ్ళే ఎవరో ఒకరు ఈ దౌర్భాగ్యపు పనికి పూనుకుని వుంటారని నా అంచనా" అన్నాడు సుధాకర్ విచార వదనంతో.

"రిపోర్టు యివ్వలేకపోయావా!" ప్రశ్నించాడు చిరంజీవి. ఆ ప్రశ్నకు విస్మయంగా చూశాడు సుధాకర్.

"ఎవరిమీద రిపోర్టు యివ్వమంటావు? రిపోర్టు యిస్తే ఈ యింటి పరువును నేనే నలుగురిలో నట్టేట్లో ముంచెత్తినట్లుగా అవుతుంది."

తల పంకించాడు చిరంజీవి.

చిరంజీవి కూడా పోలీసు డిపార్టుమెంటులోనే పనిచేస్తున్నాడు. పైగా సుధాకర్ కన్నా పెద్ద హోదాలో సూపరెంటెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్నాడు. సుధాకర్, చిరంజీవి బాల్యస్నేహితులు ఇద్దరూ ఒకేసారి సబ్-ఇన్‌స్పెక్టర్లుగా వుద్యోగాలలో చేరారు. అయితే, చిరంజీవి తన తెలివి తేటలతో అంచెలంచెలుగా సూపరెంటెంట్ ఆఫ్ పోలీస్ హోదాకు ఎదగ గలిగాడు. సుధాకర్ 'డియస్పీ'గా మారగలిగాడు. వాళ్ళిద్దరి మధ్యనగల హోదాల వ్యత్యాసాలు వారి స్నేహానికి ఎటువంటి విఘాతాన్ని కలిగించలేదు.

ఎటువంటి సంక్లిష్టమైన కేసునైనా తన తెలివితేటలతో పరిష్కరించగలడన్న నమ్మకం పోలీసు డిపార్టుమెంటులో చిరంజీవికి పుష్కలంగా వుంది.

"నువ్వు చెప్పింది కూడా నిజమే సుధాకర్! మన యింట్లో పట్ట పగలు జరిగిన దొంగతనం గురించి రిపోర్ట్ యిస్తే మన డిపార్టుమెంటుకే తలవంపు అందులోనూ. ఇంటి దొంగను రచ్చకెక్కిస్తే మన యింటి పరువును మనమే తీసుకున్నట్టుగా అవుతుంది. పోనీ మీ యింట్లో పని చేస్తున్న నాగరత్నంమీద నీకు ఏమైనా అనుమానం వుందా?" అడిగాడు చిరంజీవి

"ఊహూఁ నాగరత్నం చాలా సిన్సియర్. నాలుగు సంవత్సరాల నుండి పని చేస్తుంది" జవాబు చెప్పాడు సుధాకర్.

తల పంకించాడు. చిరంజీవి. జేబులో నుంచి స్పెన్సర్ చుట్టనుతీసి వెలిగించాడు.

కొదిసేపు మౌనం వాళ్ళిద్దరిమధ్య భారంగా దొర్లి పోయింది.

"ఈ సమస్యను నువ్వే పరిష్కరించాలనే నిన్ను అర్జంటుగా రమ్మనమని ఫోన్ చేశాను. ఈ యింటి పరువు బజారుకెక్కకుండా నువ్వే చూడాలి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు సుధాకర్.

సుధాకర్ ఇంట్లో సభ్యుల సంఖ్య ఏమంత పెద్దది కూడాకాదు పనివాళ్ళతో సహా కలుపుకుంటే ఆ యింట్లో వుంటున్నది అయిదుగురే. సుధాకర్, సుధాకర్ భార్య జయలక్ష్మి. కొడుకు మోహన్, కూతురు రాజేశ్వరి, వంటమనిషి నాగరత్నం. తోటమాలి వీరన్న. తోటమాలి సాయంకాలం వచ్చి మొక్కలకు నీరుపోసి, గార్డెన్‌ను శుభ్రపరచి వెళ్ళిపోతాడు. ఇంట్లో చోరీ జరిగిన సమయం ఉదయం పూట కావటంవలన తోటమాలిని అనుమానించడానికి ఆస్కారం లేదు.

అయితే ఆ బంగారు గొలుసును ఇంట్లో వున్న అయిదుగురు వ్యక్తులలో ఒకరు తీశారన్నది ఖాయం!

తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు చిరంజీవి

ఆ ఇంట్లోగల వారంతా వున్నత విద్యావంతులే. చివరకు వంటమనిషి నాగరత్నం కూడా హోమ్ సైన్స్‌లో సర్టిఫికేట్ పొందిన వ్యక్తి.

"సుధాకర్! మీ యింట్లో వాళ్ళందరిని మొదట కొన్ని ప్రశ్నలడగాలి ముందుగా మీ అమ్మాయి రాజేశ్వరినిపిలు." అన్నాడు.

సరేనని చెప్పి. రాజేశ్వరిని పిలిచాడు సుధాకర్

"నమస్తే అంకుల్!" అంటూ వచ్చింది రాజేశ్వరి ఆమె ఎమ్మే ఫైనలియర్ చదువుతూంది. కుందనపు బొమ్మలాగ వుంటుంది.

"డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో నువ్వు గొలుసును ఎందుకు వుంచావు?" ప్రశ్నించాడు.

"అసలు ఆ గొలుసు ఎప్పుడూ నా మెడలో నుంచి తీసే అలవాటులేదు అంకుల్ ఉదయం ఆ గొలుసు హుక్ విరిగిపోతే డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో వుంచి బాత్‌రూంలోకి వెళ్ళాను. డాడీతో చెప్పి హుక్‌ను ఎవరి చేతనైనా అతికించడానికి గాను పంపిందామనుకున్నాను. డాడీ రాగానే గొలుసు కోసం సొరుగులో చూస్తే కనిపించలేదు." వివరంగా చెప్పింది రాజేశ్వరి.

చిరంజీవి ఆమె వైపు సాలోచనగా చూస్తూ "చూడమ్మా రాజేశ్వరీ! నువ్వు గొలుసు ఆ సొరుగులోనే వుంచావా! లేక పొరపాటుగా యింకెక్కడైనా వుంచావా?"

"నో, అంకుల్! ఆ సొరుగులోనే వుంచాను" అంది దృఢస్వరంతో.

"సరే. ఇక నువ్వెళ్ళు." అన్నాడు చిరంజీవి.

రాజేశ్వరి ఆ గదిలో నుంచి వెళ్ళిపోయింది.

గదిలో సుధాకర్, చిరంజీవి యిద్దరే మిగిలారు. అది సుధాకర్ గది. ఎయిర్ కండిషన్డ్ చెయ్యబడింది. రాజేశ్వరి వెళ్ళిన తరువాత కొద్దిసేపు చిరంజీవి ఏం మాట్లాడకుండా స్పెన్సర్ చుట్టను కాల్చడంలో

విముగ్ధుడయ్యాడు.


చుట్ట కాల్చడం పూర్తయిన పిమ్మట దానిని యాష్‌ట్రేలో వడేసి సుధాకర్ వైపు చూశాడు చిరంజీవి.

"సుధాకర్ వినో ప్రశ్న అడుగుతాను. దయచేసి అలా అడిగినందుకు నువ్వు మనసులో ఏం బాధపడకూడదు. నేర పరిశోధనలో యిది కూడా ఒక భాగంగానే భావించు" అన్నాడు.

అంగీకార సూచకంగా తల వూపాడు సుధాకర్.

"మీ అమ్మాయి బాగా ఖర్చుచేస్తుంటుందా?"

"ఊహూఁ. చాలా పొదుపు. నేను నెల



నెలా మా అమ్మాయికి నూరు రూపాయలు పాకెట్‌మనీ క్రింద యిస్తుంటాను. అందులో సగంకూడా ఖర్చుచెయ్యదు."

"ఏరే బాయ్ ఫ్రండ్స్ ఎవరైనా వున్నారా?"

చిరంజీవి అడిగిన ఈ ప్రశ్నకు సుధాకర్ ముఖం జేవురించింది. తనను తాను కంట్రోల్ చేసుకుంటూ—

"మా ఇంటి విషయాలన్నీ మీకు తెలుసు. మా అమ్మాయికి బాయ్ ఫ్రెండ్సంటూ ఎవరూ లేరు. కాని, యూనివర్సిటీలో రవికుమార్‌ను ప్రేమిస్తున్నట్టు. అతడ్నే పెళ్ళి చేసుకుంటానని మంకుపట్టుపట్టి కూర్చున్న సంగతి మీకు యిదివరకే చెప్పాను".

"అఫ్‌కోర్స్. మనిషి స్వతహాగా మంచి వాడే కావచ్చును. కాని కొన్ని పరిస్థితులు మంచివాళ్ళను సైతం నేరస్తుల్ని గావిస్తుంటాయి. ఈ విషయాన్ని మనం విస్మరించ రాదు." సీరియస్‌గా అన్నాడు చిరంజీవి.

అతడి మాటలతో ఏకీభవిస్తున్నట్లుగా మౌనం వహించాడు సుధాకర్

"మీ అబ్బాయి మోహన్ ఇంట్లో వున్నాడా?" మరో స్పెన్సర్ చుట్టను వెలిగించుకుని తాపీగా అడిగాడు చిరంజీవి.

"అందరూ ఇంట్లోనే వున్నారు."

"అందరూ ఒక్కసారే అక్కర్లేదుగాని మోహన్‌ను పిలు"

సుధాకర్ వెళ్ళి కొడుకును పిలుచుకు వచ్చాడు.

మోహన్ స్టయిల్‌గా గదిలోకి వచ్చాడు. అతడు ఎమ్.బి.బి.ఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. స్ఫురద్రూపి.

"గుడీవినింగ్ అంకుల్!" అని చిరంజీవిని విష్ చేశాడు

"గుడీవినింగ్" ముక్తసరిగా అన్నాడు చిరంజీవి.

మోహన్ చదువులోనే కాదు మిగతా కొన్ని విషయాల్లో కూడా చాలా చురుకైనవాడే రెండు మూడు సార్లు తన గర్ల్ ఫ్రెండ్స్‌తో సినిమాలకు వెళ్ళడం చిరంజీవి దృష్టిలో పడింది.

"మీ సిస్టర్ గొలుసు పోయింది. ఆ సంగతి మీకు తెలుసు కదూ?" సూటిగా మోహన్ కళ్ళలోనికి చూస్తూ అడిగాడు.

"యస్."

"ఆ గొలుసు ఎవరు తీశారో మీకేమైనా తెల్సా?"

ఆ ప్రశ్నకు మోహన్ మందహాసం చేశాడు.

"ఆ సంగతి నాకు తెలిసి వుంటే మా డాడీమిమ్మల్నెందుకు పిలిపిస్తారు అంకుల్" ఎదురు ప్రశ్న వేశాడు.

చిరంజీవి ముఖంలో రంగులు మారాయి.

"పోనీ. మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?"

"ఈ యింట్లో ఎవర్నని అనుమానించగలం? నాకు మాత్రం ఎవరిమీద అనుమానం లేదు."

"అయితే. గొలుసు ఎలాగ మాయమయిందంటావ్?"

"ఆ విషయం తేల్చవలసింది మెడికల్ స్టూడెంట్ కాదు. మీ డిపార్టుమెంటు తేల్చాలి." నవ్వుతూ అన్నాడు మోహన్.

ఆ మాటలకు చిరంజీవి గంభీరంగా నిట్టూర్పువిడిచి "ఇక. నువ్వు వెళ్ళవచ్చు." అన్నాడు.

మోహన్ నిష్క్రమించాక, సుధాకర్ వైపు తిరిగి.

"మీ వాడు చాలా ఖర్చు చేస్తుంటాడు కదూ?" అని ప్రశ్నించాడు.

## కాలమ్ దాటని కథ

ఒక త్రాగుబోతు రోజూకంటే కాస్త ఎక్కువగా త్రాగటంవల్ల అతనుండే కాలనీలో ఇళ్ళన్నీ తలక్రిందులుగా కనిపించసాగాయి! అయినా అతను జాగ్రతగా బయటి తలుపుల మీది నెంబర్లు దగ్గరగా వెళ్ళి చూస్తూ కంటి చూపు ఆనక నానా బాధ పడుతూ వున్నాడు.

ఇంతలో ఇంకో తాగుబోతు ఇలాగే వెతుకుతూ కనబడి పలకరించి "ఒకరికంటే ఇద్దరం వెతకటం తేలిక! మా యింటి నెంబరు అరవై ఆరు మీయింటి నెంబరు తొంభయి తొమ్మిది కదా! ఈ లైనులో నా నెంబరు కనిపిస్తే నన్ను కేక వేసెయ్! నీ నెంబరు కనిపిస్తే నిన్ను కేక వేస్తాను!" అన్నాడు.



అతని కంటే ఘనుడు

-ఎంవి. సౌజన్య

ఇద్దరూ ఆవొప్పందంతోట యిలుదేరారు. చివరికి మొదటివాడు తన ఇంటి నెంబరు గుర్తించి తలుపు కొట్టాడు. చీకట్లో తలుపు తెరిచిన మనిషి భార్యేనని అనుకుని "సారీ డార్లింగ్! వెధవలు చిన్నపార్టీ అని-తొందరగానే ముగిద్దామని రౌండ్స్ పెంచేశారు!" అన్నాడు. ఆ మాటలు వింటూనే ఆ స్త్రీ అప్పటికే సిద్ధంగా వున్న చన్నీటి బొక్కెన అతని నెత్తిన గుమ్మరించి- "ఎటూ తెల్లారిందిగా! ఆ పాలబూతు కెళ్ళి పాల పాకెట్ పట్టుకు తగలడాలని తెలియదూ!" అంది రెండు రూపాయలు చేతిలో పెట్టి. కనీసం అప్పటికైనా తన ఇల్లు దొరికినందుకు సంతోషించిన మొదటివాడు పాలపాకెట్ కోసం పోతుంటే ఓ తలుపు బయట పడుకున్న రెండవ వాడు కనిపిస్తే ఆ ఇల్లే అతనిదని గుర్తించిన మొదటివాడు.... "ఏం బ్రదర్ ఈ యిల్లేగా! బయట పడకేశావేమిటి?".... అన్నాడు.

"మా ఆవిడ నామీద కోపంతో ఇంటికి తాళంవేసి పుట్టింటికి వెళ్ళి వారంఅయ్యింది! ఇంకో వారం ఇలాగే సర్దుకోవాలి!" అన్నాడు ముడుచుకు పడుకుంటూ. ●

"ఊం. వంశోద్ధారకుడు కదా అని వీడికి నెల నెలా నూటయాభై రూపాయలు పాకెట్ మనీగా యిస్తుంటే. అది చాలక చెల్లెలు పొదుపు చేసుకుని దాచుకున్న డబ్బును కూడా 'కాకా'పట్టి లాగేస్తుంటాడు. దీనికితోడు నేనిచ్చిన పాకెట్‌మనీ అయిపోయిందంటూ అప్పుడప్పుడూ పాతిక. యాభై యిమ్మంటుంటాడు" కాస్తంత బాధగా కొడుకు గురించి చెప్పాడు సుధాకర్.

"మీ వాడికి గర్ల్‌ఫ్రెండ్స్ కూడా బాగానే వున్నట్లుంది" అన్నాడు చిరంజీవి. చిరునవ్వుతో.

"ఉన్నారు" ముభావంగా జవాబుచెప్పాడు సుధాకర్.

"మీ వంటమనిషి నాగరత్నం...." చిరంజీవి మాట పూర్తి చెయ్యకముందే "పిలవమంటావా?" అనిఅడిగాడు సుధాకర్.

"ఉహూం. ఇప్పుడే అక్కర్లేదు. మీ వంట మనిషి నాగరత్నం పిన్నియర్ అనే విషయం నాకు తెలుసుగాని నేరస్తుడు మనకు పట్టుబడేంతవరకూ యీ యింట్లో అందర్నీ అనుమానితులుగానే భావించి. ప్రశ్నించి. పరిశోధన జరపాలి" అంటూ కొద్దిసేపు ఆగి—

"నాగరత్నంఅవివాహిత- యవ్వనంలో వుంది ఆమె ఎవరితోనైనా తిరగడంగాని. అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని నువ్వు ఎప్పుడైనా గమనించావా?"

తల అడ్డంగా వూపాడు సుధాకర్.

"ఇంతవరకూ నా దృష్టికి అటువంటివేం రాలేదు. కాని. మాకు వుదయంపూట పాలు తెచ్చేవాడితో మాత్రం చనువుగా మాట్లాడటం చాలాసార్లు నేను గమనించాను"

"సరే. నాగరత్నంను పిలు." అన్నాడు చిరంజీవి.

నాగరత్నం వచ్చేక ఆమెను ఎక్కువగా ప్రశ్నించలేదు. "నీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?" అని మాత్రం ప్రశ్నించాడు. ఆమె తలను 'లేదు' అన్నట్లుగా ఊపింది.

"సరే. నువ్వెళ్ళు నీ పని చూసుకో" అని చెప్పి. సుధాకర్‌ను జయలక్ష్మిని పిలుచుకు రమ్మన్నాడు చిరంజీవి.

సుధాకర్ వలిక్కిపడ్డాడు.

"అంటే. నా మిసెస్ కూడా అనుమానితురాలేనా?"

"యస్. నేరస్తుడుదొరకాలంటే తప్పదు మరి."

మరింక చేసేదిలేక సుధాకర్ వెళ్ళి తన భార్యను పిలుచుకొచ్చాడు.

"నమస్కారం అన్నయ్యగారు. ఎన్నడూ జరగనిది ఈ రోజు జరిగింది. ఇంతవరకు కనీసం ఈ ఇంట్లో ఏ చిన్న వస్తువూ పోలేదు." విచారవదనంతో సోఫాలో కూర్చుని అంది జయలక్ష్మి.

"మీకు ఎవరిమీదనైనా అనుమానంగా వుందా?" ప్రశ్నించాడుచిరంజీవి. లేదన్నట్లు చెప్పింది. మరింక ఆమెను ప్రశ్నించడానికి ఏం తోచకపోవడంతో "మీరిక వెళ్ళిపోవచ్చు...." అని చెప్పాడు చిరంజీవి.

"అందర్నీ ప్రశ్నించావు. నేనుమాత్రం మిగిలిపోయాను. నేరస్తుడు దొరికేంతవరకూ అందరూ అనుమానితులేగదా! నన్నూ ప్రశ్నించు...." చిన్నగా మందహాసం గావించాడు సుధాకర్.

"అనుమానం వున్నంత మాత్రాన నేరస్తుడి క్రింద లెక్కకాదు. గొలుసు ఈ యింట్లో పోయింది. ఇంట్లో వున్నది అయిదు మంది మాత్రమే. వీరిలో ఎవరో ఒకరు ఆ వస్తువును కాజేసి వుండాలి. ఆ వ్యక్తి దొరకాలంటే అందర్నీ ప్రశ్నించక తప్పదు. అలా ప్రశ్నించడం వలన నేరస్తుణ్ణి కనుగొనడానికి ఏదైనా ఆధారం దొరకవచ్చు. అనుమానం మీదనే యింట్లో వాళ్ళందర్ని ప్రశ్నిస్తున్నానని ఎందుకనుకోవాలి? కేవలం అనుమానం వల్లనే కాకుండా ఏదైనా 'క్లూ' దొరకవచ్చుననే ఆశతో ప్రశ్నిస్తున్నానని ఎందుకనుకోకూడదూ?" చిరంజీవి ప్రశ్నకు సుధాకర్ జవాబు యివ్వలేదు.

సమస్య కాస్తంత జటిలంగా కనిపించింది చిరంజీవికి.

"ఇంట్లో దొంగను ఈశ్వరుడైనా పట్టలేడని చాలామంది అంటుంటారుగాని అది నిజంకాదని తాను నిరూపించాలి. నిరూపించి తీరాలి! లేకపోతే, ఎటువంటి కేసునైనా పరిష్కరించగల పోలీసాఫీసరుగా పేరు తెచ్చుకున్న తన పరువు ఏంకావాలి?

తీవ్రంగా ఆలోచించసాగేడు చిరంజీవి.

'ఈ కేసును చిరంజీవి ఎలాగ తేల్చగలుగుతాడో చూడాలి! తామిద్దరూ ఒకేసారి సబ్‌యిన్‌స్పెక్టర్లుగా జాయినయినా ఇప్పుడు ఈ చిరంజీవి తనకన్నా పెద్ద హోదాలో వున్నాడు. గొలుసు సంగతి దేషదెపుగును గాని. ముందు చిరంజీవి తెలివిగా నేరస్తుడ్ని పట్టుకోలేకపోతే. వాడి తెలివితేటలు ఏపాటివో వెల్లడవుతాయి' మనసులో అనుకున్నాడు సుధాకర్.

ఆలోచనల్లో నిమగ్నమైన చిరంజీవికి బుర్రలో ఏదో మెరుపు మెరిసినట్లు అయింది. టేబుల్ మీద వున్న ఫోనును దగ్గరకు

లాక్కుని తన ఇంటికి ఫోన్ చేసి అటెండరును తమ ఇంట్లో అల్మారాలో గల నెంబర్ త్రీ అంకె గల సీసాను వెంటనే సుధాకర్ ఇంటికి తెమ్మనమని చెప్పాడు.

* * *

సుధాకర్ గదిలో ఆ యింట్లో గల సభ్యులందరూ సోఫాల్లో కూర్చున్నారు.

అటెండరు తీసుకువచ్చిన సీసా టేబుల్ మీద వుంది. దానిలో సగానికి పైగా తెల్లని ద్రవం వుంది.


ఆ గదిలో వున్న అందరి దృష్టి ఆ సీసా మీదనే కేంద్రీకరింపబడి వుంది.

చిరంజీవి ఆ గదిలో వున్నవారందర్నీ ఒకసారి పరిశీలనగా చూసి, గొంతు సవరించుకున్నాడు.

"వైజ్ఞానికంగా ఈనాడు ప్రపంచం ఎంతో పురోగతిని సాధించింది. విద్యావంతులైన మీ అందరికీ ఈ విషయం తెలుసు. నేర పరిశోధనలో కూడా శాస్త్రీయ దృక్పథం ప్రముఖపాత్ర వహిస్తున్నది. నేను యిప్పుడు తెప్పించిన సీసాలో గల ద్రవం మానవుని తెలివితేటలకు చిహ్నం. దీనివలన నేరస్తుల్ని కనుగొనడం చాలా తేలిక. గొలుసును ఈ యింట్లో గల వ్యక్తే దొంగిలించి వుండాలి. మరొకరు ఎవరో పై వ్యక్తి దొంగిలించడానికి అవకాశం లేదు. కనుక దయచేసి నేరం చేసిన వ్యక్తి ఎవరో ముందుకు వచ్చి తమ తప్పును అంగీకరించితే మంచిది. చేసిన తప్పును కప్పిపుచ్చుకోకుండా పశ్చాత్తాప హృదయంతో దానిని అంగీకరించడం జరిగితే నేను చాలా సంతోషిస్తాను" అన్నాడు.

ఎవరూ చిరంజీవి మాటలకు బదులు పలకలేదు. చిరంజీవి దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

## పరిచయం



పుట్టింది, పెరిగింది, డిగ్రీ వరకూ చదివింది. ప్రస్తుతం వుంటున్నదీ-అంతా శ్రీకాకుళంలోనే.

మూడు పదుల వసంతాలను చూశాను. కొన్నాళ్ళు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేఖరిగా పనిచేశాను. ప్రస్తుతం వృత్తి ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్. ప్రవృత్తి రచనా వ్యాసంగం. ఇంతవరకూ నూటయాభైకు పైగా కథలు, వ్యాసాలు, కవితలు ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, స్వాతి, జ్యోతి, భారతి, విజయ మొదలైన పత్రికలలో ప్రచురించబడినాయి. మూడు నవలలు ప్రచురితం. ఆకాశవాణి ద్వారా డజనుకు పైగా ప్రసంగవ్యాసాలు, మూడు నాటికలు ప్రసారం చేయబడినాయి. ఇంతకుమించి చెప్పుకోదగ్గ విశేషాలేం నా గురించిలేవు.

—కశింకోట ప్రభాకరదేవ్

"ఆల్‌రైట్ ఒక అరగంటలోపల నేరస్తుడు దొరికిపోతాడు" అని చెప్పి, అయిదు చీపురుపుల్లలు తెప్పించాడు. ఆ చీపురు పుల్లలను స్కేలుతో నాలుగు అంగుళాల పొడవు వున్నట్లుగా కొలిచి విరిచాడు. సీసాలో గల ద్రవాన్ని యింట్లో గలవాళ్ళందరి అరచేతులకు దూదితో పాలిష్ చేసినట్లుగా రాసాడు. ఆ తరువాత కట్ చేసివున్న నాలుగు అంగుళాల పొడవు గల చీపురుపుల్లలను సుధాకర్‌తో సహా అందరికి యిచ్చి "వీటిని తీసుకుని మీ గదుల్లోకి వెళ్ళండి. పది నిముషాల తరువాత తిరిగి యిక్కడకు మీరందరూ ఆ చీపురుపుల్లలతో రావాలి. నేరస్తుడు తన తెలివితేటలతో ఒకవేళ కొత్త చీపురు పుల్లను సరిగ్గా నాలుగు అంగుళాలకు విరచిపట్టుకు రావాలని మాత్రం ప్రయత్నించకండి. ఒకవేళ అలా చేసినా నేరస్తుడు దొరకక మానడు. ఎందుచేతనంటే మీ అరచేతులకు రాసిన ద్రవం ఫలితంగా యిప్పటికే దాని ప్రభావం చూపిస్తూ వుంటుంది. నేరస్తుడు కొత్త చీపురు పుల్లను వుపయోగిస్తే ఆ తేడా తెలిసిపోతుంది. ఇక, నేరస్తుడికి స్వతహాగా లోలోపల భయ చిహ్నాలు వుంటాయి. దానివలన నాడీ స్పందన హెచ్చుకాక తప్పదు ఈ ద్రవం వుపయోగం ముఖ్యంగా ఏమిటంటే నేరస్తుడి భయాందోళనల ఫలితంగా ఏర్పడిన నరాల స్పందన తీవ్రతను బట్టి అతనికి యిచ్చిన చీపురు పుల్ల ఒక అంగుళం మేరకు సాగిపోతుంది. ఈ విషయాన్ని మీరందరూ జాగ్రత్తగా గమనించాలి. ఇక, మీరందరూ మీ గదుల్లోకి వెళ్ళి సరిగ్గా పది నిమిషాల తరువాత యిక్కడకు వచ్చి ఆ చీపురు పుల్లలను నాకు యివ్వాలి." అని చెప్పాడు చిరంజీవి.

సుధాకర్‌తో సహా అందరూ ఆ గదిలో నుంచి బయటకు వెళ్ళిపోయారు.


గదిలో చిరంజీవి మాత్రం ఒక్కడే మిగిలిపోయాడు.


అటెండరు తీసుకువచ్చిన సీసాలో యింకా మిగిలివున్న ద్రవాన్ని ఒకసారి చూసి తృప్తిగా మందహాసం గావించాడు. మరో స్పెన్సర్ చుట్ట వెలిగించి, పొగను ఆస్వాదించడంలో లీనమయ్యాడు.

పది నిముషాలు గడిచాయి.

యింట్లో గల సభ్యులందరూ ఆ గదిలోకి వచ్చి తమ చీపురుపుల్లను యిచ్చారు. వాటిని జాగ్రత్తగా ఒక కాగితంలో చుట్టి సోఫాలో నుంచి లేచాడు. "నేరస్తుడెవరో తెలిసింది. అయితే ఆ విషయం మీకు యిప్పుడు చెప్పను త్వరలో సుధాకర్ చెబుతాడు" అని చెప్పి సుధాకర్ వైపు తిరిగి "సుధాకర్! ప్లీజ్ ఫాలో మీ...." అన్నాడు.

ఇద్దరూ యింట్లోనుంచి బైటపడి, జీపులో స్టేషనుకు బయలుదేరారు. సుధాకర్ ఆత్రు






తను అణచుకోలేక—"ఇంతకీ ఆ నేరస్తుడు ఎవరు?" అని ప్రశ్నించాడు చిరంజీవిని

"నువ్వే. ఎందుకు చేశావు....?" సీరియస్‌గా అన్నాడు చిరంజీవి.

సుధాకర్ ఆశ్చర్యంగా చూశాడు. ఆ తరువాత అంగీకార సూచనగా తలూపుతూ "అవును. నేనే ఆ పని చేశాను. ఎందుకంటే. నువ్వు చాలా కేసుల్ని చాకచక్యంగా పరిష్కరించావు ఎలా పరిష్కరించగలిగావని అడిగినా నువ్వు నాకు చెప్ప లేదు. అందుచేతనే. ప్రాక్టికల్‌గా నీ పరిశోధన ఎలా వుంటుందో తెలుసుకోవాలని ఈ ప్లాన్ వేశాను. ఇంతకీ ఆ సీసాలో గల ద్రవం ఏమిటి?" అడిగాడు.మిత్రుడి మాటలకు చిన్నగా నవ్వి.

"ఆ ద్రవం మంచి నీళ్ళు. అయితే అందులో కాస్తంత కర్పూరం కలిపాను. ఇక నా పరిశోధన గురించి నువ్వు ఇంతగా ఇంటరెస్ట్ చూపిస్తున్నావు గనుక అసలు విషయం చెబుతున్నాను. నేను చేసింది చాలా సింపుల్ ట్రిక్ మీ ఇంట్లో వాళ్ళందరూ విద్యావంతులే గదా! మరి అందువల్లనే ఈ చీపురుపుల్లలతో ప్రయోగం చేశాను. కర్పూరం కలిపిన నీటివలన చీపురుపుల్లలమీద ఎటువంటి ప్రభావం వుండదు. నేను చెప్పినట్లుగా అంగుళం మేరకు నేరస్తుడి చేతిలోగల చీపురుపుల్ల సాగిపోదు కాని నేరస్తుడు తన అతి తెలివితేటల్తో అంగుళం మేరకు చీపురుపుల్ల సాగిపోతుందని నా మాటల్ని నమ్మి. అంగుళం మేరకు ఆ చీపురుపుల్లను కట్ చేసేస్తాడు. ఎందుకంటే అతడు నేరస్తుడు కనుక తన చేతిలోగల చీపురుపుల్ల నా మాటల్నిబట్టి ఎలాగూ ఒక అంగుళం సాగుతుంది కనుక తెలివిగా తన బుర్రను ఉపయోగిస్తాడు. అప్పుడు ఆ చీపురుపుల్ల నా మాట ప్రకారం నాలుగు అంగుళాలు మాత్రమే వుంటుంది. నువ్వు చేసిన పని కూడా ఇదే కావలిస్తే చూడు నువ్విచ్చిన చీపురుపుల్ల అంగుళం సాగిపోయిలేదు అంగుళం మేరకు తరిగిపోయి వుంది ఆ అంగుళం పెరుగుతుందని నమ్మి నువ్వు 'కట్' చేసి నా ట్రాప్‌లో పడ్డావు" అన్నాడు. చిరంజీవి చాకచక్యానికి మనసులోనే జోహార్లర్పించాడు సుధాకర్.

●





మీరా ఎలాంటి మిక్సర్ తోనైన అన్యోన్యంగా ఉంటుంది.

ఎలాంటి భారతీయ లేదా దిగుమతి చేసుకొన్న మెషీనుకైన సరిగ్గా అమరి
ఉండే ఏకైక స్టెయిన్‌లెస్‌స్టీల్ గ్రైండర్ ఎటాచ్‌మెంట్స్.
మీరా గ్రైండర్ ఎటాచ్‌మెంట్ శ్రేష్ఠమైన స్టెయిన్‌లెస్‌స్టీలుతో చేయబడినది.
ఎక్కువ పదార్థాన్ని రుబ్బటానికి పెద్ద గ్రైండర్ కప్పు మరియు లోపలి
భాగము కనబరచే విరగని మూకుడు.
దీర్ఘకాలం నిలచి, త్వరితంగా, సులువుగా రుబ్బటానికి ప్రత్యేకంగా
రూపొందించబడి పదునైన రంపపుపళ్ళ బ్లేడు కలది.

4 సైజులలో మరియు
3 రకాలలో లభిస్తుంది.

మీరా meera
యూనివర్సల్ గ్రైండర్ ఎటాచ్ మెంట్

ఆంధ్రప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు
మహావీర్ ఎంటర్‌ప్రైజెస్, తిలక్‌రోడ్. హైద్రాబాద్ 1
PH : 221198, 34819